
సాక్షి
కాకినాడ

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



స్వామి ఊరేగె.. మది ఉప్పొంగె

అంతర్వేది దివ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.




లక్ష్మీప్రదం.. నారసింహుని ఆలయం

కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు గ్రామంలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులకు చినజీయర్ స్వామి శ్రీకారం చుట్టనున్నారు.

8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి కుంతీమాధవ స్వామి కల్యాణోత్సవాలు

పిఠాపురం: దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురంలో వేంచేసియున్న శ్రీ కుంతీ మాధవస్వామి వారి కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. తొలి రోజున ఆలయంలో ధ్వజారోహణ చేసి, రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహుద్దూర్ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఈఓ ఎన్.శ్రీరాములు తెలిపారు. కల్యాణోత్సవాల సందర్భంగా గ్రామోత్సవాల నిర్వహణకు ఉపయోగించే స్వామి వారి వాహనాలను శుద్ధి చేశారు. కల్యాణ మండపంలో ఏర్పాట్లు పూర్తి చేసి, భక్తుల దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 25 వరకూ జరిగే కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చనలు నిర్వహిస్తామని ఈఓ చెప్పారు. ఈ నెల 20న కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నామని శ్రీరాములు తెలిపారు.

ప్రభుత్వ నిధులు త్వరగా చెల్లించాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): దేవదాయ శాఖ సత్రాలు, ఆలయాల నుంచి ప్రభుత్వానికి చెల్లించాల్సిన నిధులను వీలైనంత త్వరగా చెల్లించాలని ఈఓలను జిల్లా దేవదాయ శాఖ అధికారి పులి నారాయణమూర్తి ఆదేశించారు. జిల్లాలోని దేవదాయ శాఖ ఆలయాలు, సత్రాల ఈఓలతో కాకినాడలోని తన కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆలయాలు, సత్రాల నుంచి అర్చక వెల్ఫేర్ ఫండ్, ఆడిట్ ఫీజు, కంట్రిబ్యూషన్, కామన్‌గుడ్ ఫండ్ మొత్తాలను వెంటనే ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఆలయాల వారీగా ఎంతెంత చెల్లించాలి, ఇప్పటి వరకూ ఎంత చెల్లించారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వానికి ఫీజులు చెల్లించకపోవడంతో పలు ఆలయాల బకాయిలు అధికంగా ఉన్నాయన్నారు. ఆయా ఫీజులు చెల్లించిన తర్వాత ఆన్‌లైన్ చలానాలను తమ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.

జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా విఠల్



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ విఠల్


కాకినాడ క్రైం: జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం.పాండురంగ విఠల్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ లావణ్యకుమారి నెల రోజుల సెలవుపై వెళుతున్న నేపథ్యంలో ఆ బాధ్యతలను డాక్టర్ విఠల్‌కు అప్పగించారు. ఆర్థోపెడిక్స్ విభాగాధిపతిగా కొనసాగుతున్న ఆయన.. అదనపు బాధ్యతల్లో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి జైలు శిక్ష

అమలాపురం టౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన పోక్సో కేసుకు సంబంధించి ఇద్దరికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పారు. అప్పటి చింతూరు డీఎస్పీ, ప్రస్తుత కోనసీమ జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఈ కేసును దర్యాప్తు చేశారు. చింతూరు మండలం కుమ్మూరు పంచాయతీ శివారు కోయ మామిళ్లగూడెంలో నమోదైన పోక్సో కేసులో నిందితులు మిడియం రమేష్, ముచ్చిక లక్ష్మణరావులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఓ బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టి, ఆపై హత్య చేశారన్న అభియోగంపై నిందితులిద్దరికీ ఈ శిక్ష పడింది.

ఊజీగా పట్టుకుంది

- పట్టు పురుగులపై ఊజీ ఈగ దాడి
- నష్టపోతున్నామని రైతుల గగ్గోలు
- నివారణ చర్యలు చేపట్టిన అధికారులు



పట్టు పురుగుపై ఆశించిన ఊజీ ఈగ

పిఠాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పట్టు రైతులను ఎక్సోరిస్టా బొంబీసీస్ (ఊజీ ఈగ) వణికిస్తోంది. ఈ ఈగ పట్టు పురుగులపై నిరంతరం దాడి చేస్తూండటంతో పంటకు పెను నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పంట దిగుబడి తగ్గిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ క్రాప్ హాలిడే ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని పలమనేరు, హిందుపురంతో పాటు జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టుగూళ్ల కొనుగోలు కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పట్టు రైతులకు ఊజీ ఈగ నివారణ చర్యలపై చేబ్రోలులోని పట్టు పరిశ్రమ సాంకేతిక సేవా కేంద్రం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ఇలా వ్యాపిస్తుంది

ఊజీ ఈగ లార్వా దశలో ఉన్న పట్టు పురుగును ఆశించి, అంతర్గత పరాన్నజీవిగా తన జీవిత చరిత్రను పూర్తి చేసుకుంటుంది. వీటి వల్ల పంటకు 10 నుంచి 30 శాతం వరకు నష్టం వాటిల్లుతుంది. ఒక ఈగ సుమారు 400 నుంచి 500 వరకు గుడ్లు పెడుతుంది. కేవలం రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఆ గుడ్లు పొదుగుతుంది. ఈగ సోకిన పట్టు పురుగుపై నల్లని మచ్చలు ఏర్పడతాయి. ఇలా మచ్చ కనిపిస్తే పట్టు పురుగుకు ఊజీ ఈగ సోకినట్లు నిర్ధారించుకోవాలి. పట్టు పురుగు శరీరంలోకి ఈగ ప్రవేశించిన తరువాత లార్వా దశ 6 నుంచి 8 రోజుల వరకు కొనసాగుతుంది. తరువాత పట్టు పురుగు శరీరాన్ని చీల్చుకుని మెగాట్ రూపంలో ఈగ బయటకు వస్తుంది. బయట సంచరించి 20 నుంచి 24 గంటల్లో ప్యూపాగా రూపాంతరం చెందుతుంది. జీవిత చక్రాన్ని 32 నుంచి 35 రోజుల్లో పూర్తి చేసుకుంటుంది.

నివారణ పద్ధతులు

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఊజీ ఈగను నివారించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. భౌతిక, రసాయన, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా ఈగను పూర్తిగా నివారించుకుని నష్టాలు లేకుండా మంచి దిగుబడులు సాధించవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

- భౌతిక నియంత్రణ పద్ధతుల్లో భాగంగా పట్టు పురుగులను పెంచడానికి ఏర్పాటు చేసుకున్న షెడ్డు కిటికీలకు, గుమ్మాలకు దోమ తెరలు, స్ప్రింగ్ డోర్లు అమర్చుకోవాలి. గుమ్మాల వద్ద యాంటీ చాంబర్ గది తప్పనిసరిగా నిర్మించుకోవాలి.
- రసాయన పద్ధతుల్లో భాగంగా మార్కెట్‌లో లభించే ఊజీ మాత్రలు, ఏస్పర్ ద్రావణాన్ని తెల్లటి ప్లాస్టిక్ ట్రే లేదా పళ్లెంలో లీటరు నీటికి ఒక మాత్ర లేదా ఒక మూత ద్రావణం చొప్పున కలిపి, పట్టు పురుగుల షెడ్డు వెలుపల, లోపల ఉన్న అన్ని కిటికీల్లో ఉంచాలి. ద్రావణం కలిపిన నీటిని కనీసం 7 రోజులకొకసారి మార్చుకోవాలి. పట్టు పురుగులు బ్రసింగ్ నుంచి గూడు కట్టే వరకూ ఈ పద్ధతి అవలంబించాలి.
- పట్టు పురుగుల షెడ్డు వెలుపల, లోపల పచ్చ రంగు జిగురు అట్టలు అమర్చుకోవడం ద్వారా కూడా ఊజీ ఈగను నివారించవచ్చు.
- నెసోలిన్స్ తెమస్ అనే జీవ నియంత్రణ కీటకం ఊజీ ప్యూపాలను ఆశించి సంతానాన్ని అభివృద్ధి చేసుకుంటుంది. ఈ క్రమంలో అది ఊజీ ఈగలను సమర్థంగా నివారిస్తుంది. ఈ జీవ నియంత్రణ చర్యల్లో భాగంగా కీటకాలను విడుదల చేసే విధంగా ప్రతి 100 గుడ్లకు 50 మిల్లీలీటర్ల పౌచ్‌లు రెండింటిని సంచుల్లో వేసుకోవాలి. పట్టు పురుగుల మూడో దశ నుంచి పంట పూర్తయ్యేంత వరకు వీటిని విడుదల చేసేలా ఏర్పాటు చేసుకోవాలి.
- పంట పూర్తయిన తరువాత ఈ కీటక సంచులను కంపోస్టు గుంతల దగ్గర నీడ ప్రదేశాల్లో వేలాడదీయాలి. మార్కెట్ యార్డుల్లో ఫ్లేమ్ గన్ ఉపయోగించి ఊజీ మెగాట్లను, ప్యూపాలను ఎప్పటికప్పుడు సమర్థంగా నివారించుకోవచ్చు.
- ఈవిధంగా ప్రతి రైతూ సమగ్ర సస్య రక్షణ చర్యలు తీసుకుంటే ఊజీ ఈగను నివారించవచ్చు.

క్రాప్ హాలిడే ప్రకటించాలనుకుంటున్నాం



ఊజీ ఈగ పట్టు పురుగులపై తీవ్రంగా దాడి చేస్తోంది. ఇప్పటికే 90 శాతం పంటపై ఆశించింది. దీంతో తీవ్ర నష్టాలు చవి చూస్తున్నాం. పెట్టుబడులు సైతం వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఈగ జీవిత కాలం 45 రోజులు క్రాప్ హాలిడే ప్రకటించడం వలన వీటిని పూర్తిగా నివారించవచ్చు. తరువాత పంట వేసుకున్నా ఇబ్బంది ఉండదని భావిస్తున్నాం. అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. అవి పని చేయకపోతే క్రాప్ హాలిడే ప్రకటించాలనుకుంటున్నాం.

– కె.గంగేశ్వరుడు, పట్టు రైతు, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పట్టు సాగు వివరాలు

సాగు చేస్తున్న మండలాలు	: 19
గ్రామాలు	: 155
రైతులు	: 1,150 మంది
విస్తీర్ణం	: 4,500 ఎకరాలు
జిల్లాలో రోజువారీ పట్టుగూళ్ల దిగుబడి	: 5 టన్నులు

అన్ని చర్యలూ తీసుకుంటున్నాం

ప్రస్తుతం పట్టు పురుగులపై ఊజీ ఈగ ప్రభావం **ఉన్నట్లు నిర్ధారించా**ం. దీనిపై శాస్త్రవేత్తలతో **మాట్లాడి**, వారి సూచనల మేరకు పౌచ్‌లు రప్పిస్తున్నాం. ఊజీ ఈగ సోకిన పంటలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, అన్ని రకాల సూచనలు, సలహాలు ఇచ్చాం. రైతులు వీటిని పాటించడం ద్వారా ఊజీ ఈగలను వంద శాతం నివారించుకునే వీలుంటుంది. రెండు రోజులకోసారి పంటలను పరిశీలించి తగిన చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే చాలా వరకూ నివారణ చర్యలు తీసుకోవడం వల్ల క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన అవసరం ఉండదు.

– బీఎంబీ రామరాజు, డిప్యూటీ డైరెక్టర్, పట్టు పరిశ్రమ శాఖ, కాకినాడ



చేబ్రోలులోని పట్టు పరిశ్రమ సాంకేతిక సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మళ్లీ జగనే సీఎం



సునీల్‌తో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు, మంత్రి కారుమూరి తదితరులు

- జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో విజయ ఢంకా మోగిస్తాం
- సునీల్ ఎంపీ అవడం ఖాయం
- ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రాబోతోందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయి తీరుతారని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. రమణయ్యపేట వైద్య నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ సమన్వయకర్త చలమలశెట్టి సునీల్‌తో శనివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచీ వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సునీల్‌కు పరిచయం చేశారు. కన్నబాబును, సునీల్‌ను నేతలు గజమాలతో సత్కరించి, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ, జిల్లాతో పాటు రాష్ట్రంలో పరిచయం అవసరం లేని నాయకుడు సునీల్ అని, ఆయనకు అంత ఇమేజ్ ఉందని అన్నారు. పార్టీ గట్టిగా కోరుకుని సునీల్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రతిపాదించిందని, సీఎం జగన్ ఆశీస్సులతో ఆయన పార్లమెంట్ నియోజవర్గంలో పర్యటిస్తూ ముఖ్య నాయకులను కలుసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పని చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో సునీల్ ఎంపీ అయి తీరుతారని, జిల్లాలోని ఏడు నియోజవర్గాల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులందరం ఎమ్మెల్యేలుగా కచ్చితంగా గెలిచి తీరుతామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని చెప్పారు. తమ పార్టీ 2019 కన్నా ప్రస్తుతం మరింత బలంగా ఉందన్నారు. చంద్రబాబువి అవకాశవాద రాజకీయాలని, విలువలు లేవని విమర్శించారు. బీజేపీతో పొత్తు అంటారని.. కమ్యూనిస్టులతో మాట్లాడతారని, కాంగ్రెస్‌తో టచ్‌లో ఉంటారని చంద్రబాబు తీరును దుయ్యబట్టారు. నిజాయతీతో కూడిన రాజకీయాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రాండ్‌గా నిలిచి, పేదల పక్షాన ఉన్నారని కన్నబాబు అన్నారు.

సునీల్ మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా 'వై నాట్ 175'కు అనుగుణంగా జిల్లాలోని ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాల్లో తప్పకుండా గెలుస్తామని అన్నారు. అందరి ఆదరాభిమానాలతోనే తనకు సీఎం జగన్ మళ్లీ చాన్స్ ఇచ్చారని, తనను ఎంపీగా, కన్నబాబును ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచేలా ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ గొప్ప పునాది వేశారన్నారు. రానున్న తరాలకు గొప్ప భవిష్యత్తు అందిస్తున్నారని చెప్పారు. ఎంపీగా విజయం కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, నాయకులు చింతా ఈశ్వరరావు, బెజవాడ సత్యనారాయణ, గోపుశెట్టి బాబ్జీ, జమ్మలమడక నాగమణి, జంగా గగారిన్, దడాల జాషువా గిరి, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం పాలన

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- బొద్దవరంలో అభివృద్ధి పనులు ప్రారంభం



బొద్దవరంలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. కోటనందూరు మండలం బొద్దవరంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను, రూ.10 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాలును ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేగి లక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి రాజా ప్రసంగించారు. టీడీపీ హయాంలో మాదిరిగా గ్రాఫిక్స్ కాకుండా, రాష్ట్రంలో చేసిన అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తుంటే టీడీపీ నాయకులు, పచ్చ మీడియా ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. జగన్ సీఎంగా అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం పెంచడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి అనేక పరిశ్రమలు, యువతకు ఉద్యోగావకాశాలు తీసుకువచ్చారని తెలిపారు. నేడు ప్రభుత్వ బడులు సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్నాయని, వాటిల్లో అన్ని సౌకర్యాలూ కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ బడుల్లోని పేద పిల్లలు ఇంగ్లిషులో మాట్లాడుతుంటే పచ్చదండు పిచ్చి కూతలు కూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ తదితర భవనాలు నిర్మించి, ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చామని, ఈ అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని మంత్రి రాజా ప్రశ్నించారు. సొంత మనుషులు కూడా ఇవ్వనంతగా వివిధ సంక్షేమ పథకాల కింద పేదల ఖాతాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డబ్బులు జమ చేశారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే మరింతగా ప్రగతి సాధ్యమవుతుందని చెప్పారు. గడచిన నాలుగేళ్ల 10 నెలల్లో సీఎం జగన్‌తో పాటు ఎమ్మెల్యేగా తాను మంచి చేశామని అనిపిస్తేనే తమకు ఓటు వేయాలని కోరారు. టీడీపీ నాయకులు చెబుతున్న కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోకుండా, వచ్చే ఎన్నికల్లో విజ్ఞతతో ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని మంత్రి రాజా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, ఏఎంసీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీటీసీ లగుడు దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

భక్తవత్సలా.. శృంగార వల్లభా



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి మాఘ మాసం రెండో శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే వందలాదిగా భక్తులు తరలివచ్చి, గంటల తరబడి క్యూలో వేచి ఉండి మరీ స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు ప్రత్యేక అలంకరణ చేశారు. సుమారు 15 వేల మంది భక్తులు శృంగార వల్లభుని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. అన్నదానం, వివిధ విరాళాలు, దర్శనం, కేశఖండన టికెట్ల ద్వారా స్వామివారికి రూ.4,32,584 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఉచితంగా పులిహోర ప్రసాదం అందించడంతో పాటు అన్నదానం చేశారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఈఓ ఆధ్వర్యాన చర్యలు చేపట్టారు.



ఆలయంలో క్యూ కట్టిన భక్తులు

- వైభవంగా అంతర్వేది ఉత్సవాలు
- గరుడ, పుష్పక వాహనాలపై ఉత్సవమూర్తులకు ఊరేగింపు

స్వామి ఊరేగె.. మది ఉప్పొంగె

సఖినేటిపల్లి: నారసింహాయా నమో నమామి.. సదా స్మరామి అంటూ ప్రతి మదీ తన్మయత్వం చెందింది.. మనసారా స్మరించింది.. అంతర్వేదిలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి దివ్య తిరు కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం సాయంత్రం గరుడ పుష్పక వాహనంపై, రాత్రి పుష్పక వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. వేదమూర్తయిన గరుడు స్వామివారి వాహనం. నిత్యం తనను సేవించే గరుడ వాహనంపై అధిరోహించి స్వామి గ్రామోత్సవానికి తరలివెళ్లారు. అలాగే తన హృదయమనే పుష్పకంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటేందుకు స్వామి పుష్పక వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకలు ఆలయ అర్చకుల పర్యవేక్షణలో జరిగాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహద్దూర్, ప్రజాప్రతినిధులు, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి ఆలయం.. తేజోమయం

లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద విద్యుద్దీపాల అలంకరణ ఆధ్యాత్మికత మరింత ఇనుమడింజేస్తుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఫ్లెక్సీలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా అయోధ్య రాముడి ఫ్లెక్సీతో పాటు పశ్చిమ రాజగోపురం, ప్రధాన, ఉపాలయాల గోపురాలు విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్నాయి. పశ్చిమ రాజగోపురం నుంచి స్వామివారి దర్శనానికి వెళ్లే మార్గంలో షామియానాలతో ఏర్పాటు చేసిన కళాకృతులు ముచ్చట గొలుపుతున్నాయి. అలాగే ఆలయం లోపల క్యూలైన్లపై వేసిన షామియానాలు కూడా అందమైన డిజైన్లతో అలరిస్తున్నాయి.


అంతర్వేదిలో పుష్పక వాహనంపై నరసింహ స్వామివారికి గ్రామోత్సవం

అంతర్వేదిలో నేడు

ఈ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ తిరువారాధన, బాలభోగం, అర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు ఉంటాయి. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ శ్రీసుదర్శన హోమం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు హంస వాహనంపై, 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ధ్వజారోహణ జరుగుతుంది. రాత్రి 8 గంటలకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.


విద్యుత్ దీపాలంకరణతో వెలుగులు జిమ్ముతున్న ప్రధాన, ఉపాలయాలు


పశ్చిమ రాజగోపురం వద్ద ఆలయం లోపల వైపు ఆకట్టుకుంటున్న అలంకరణ

లక్ష్మీప్రదం.. నారసింహుని ఆలయం

- దేవస్థానం అభివృద్ధికి నేడు శంకుస్థాపనలు
- త్రిదండి చినజీయర్ స్వామీజీచే అంకురార్పణ
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంతో పనులు

మధురపూడి: కోరుకొండ ఆధ్యాత్మికతకు నిలయం. ఆ లక్ష్మీనరసింహస్వామి కొలువైన ప్రాంతం.. స్వామివారి దేవస్థానానికి పూర్వ వైభవం తీసుకురావాలనేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అభిమతం.. అందుకే పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎన్నికల హామీలో భాగంగా ఆలయ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. దేవస్థానానికి మరింత శోభ తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దేవస్థానంలో ఐదంతస్తుల రాజగోపురం, స్వామివారి ప్రధాన ఆలయానికి మెట్ల పైనుంచి భక్తులు సులభంగా చేరుకోవడానికి వీలుగా మెట్ల మార్గం నిర్మించనున్నారు. అలాగే దేవుని కోనేరును రూ.50 లక్షల రుడా నిధులతో అభివృద్ధి చేయనున్నారు. దీని చుట్టూ కూర్చుని తెప్పోత్సవాన్ని వీక్షించేలా 100 మీటర్ల పొడవున గ్యాలరీ, చుట్టూ మెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలోని అగ్రహారంలో శ్రీరంగనాథ స్వామివారి ఆలయాన్ని టీటీడీ సహకారంతో రూ.2.10 కోట్లతో పునర్నిర్మించనున్నారు. అన్నవరం దేవస్థానం నిధులు రూ.60 లక్షలతో నారసింహుని ఆలయంలో మెట్ల మార్గానికి ఆదివారం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి శంకుస్థాపన చేయనున్నారు. కోరుకొండ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ భాగస్వామ్యంతో రూ.3.80 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పథకాలకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంలో నిర్వహించనున్నారు.


శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువు దీరిన కోరుకొండ

ఐదేళ్లలో జరిగిన పనులివీ..

కోరుకొండ బస్టాండ్ సెంటర్ నుంచి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వరకూ రథం రోడ్డును రూ.కోటితో నిర్మించారు. దీనివల్ల స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవాల సమయంలో ప్రమాదాలను నివారించారు. కొండ చుట్టూ తిరిగే గిరి ప్రదక్షిణ భక్తులకు వీలుగా రోడ్డును రూ.20 లక్షలతో అభివృద్ధి చేశారు. స్వామివారి తెప్పోత్సవం సందర్భంగా ఎలాంటి ఇబ్బంది రాకుండా నాణ్యమైన పంటును సమకూర్చారు.

సకాలంలో స్పందించేందుకు..

రాజానగరం నియోజకవర్గంలో వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉంది. అయితే అనుకోని ఘటనల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి పంటలు కాలిపోయేవి. కుప్పలుగా వేసి ధాన్యం కాలిబూడిదయ్యేది. ప్రమాదాలను సకాలంలో నిలువరించేందుకు వీలుగా రూ.80 లక్షలతో కాపవరం ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల్లో నిర్మించిన అగ్నిమాపక కేంద్రాన్ని కూడా ఆదివారం ప్రారంభించనున్నారు.

ఆ స్వామికి సేవకుడిలా..



శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి పురాతన చరిత్ర ఉంది. ఆ స్వామివారి కృపతోనే ఎమ్మెల్యేను అయ్యాను. నా తండ్రి జక్కంపూడి రామ్మోహన రావు స్ఫూర్తితో ప్రజా సేవ చేస్తున్నా. కోరుకొండలో రూ.9.40 కోట్లతో అభివృద్ధి పనులు చేశాను. ఆదివారం రూ.3.80 కోట్లతో మరిన్ని పనులకు శంకుస్థాపనలు చేస్తాం. దేవస్థానాన్ని మరింత ప్రగతి పథాన తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తా.

–జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆలయ పునర్నిర్మాణం అద్భుత ఘట్టం



కోరుకొండలో రూ.2.10 కోట్లతో పురాతన శ్రీరంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం చేపట్టనుండటం అద్భుత ఘట్టం. 1930 దశకంలో నిర్మించిన ఆలయంలో స్వామివారి విగ్రహం నిలుచుని ఉండడం ఇక్కడ ప్రత్యేకత. అలాగే లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో రాజగోపురం, మెట్ల నిర్మాణం తదితర పనులకు త్రిదండి చినజీయర్ స్వామి రావడం ఇక్కడి ప్రజల అదృష్టం. దీనికి సహకరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు.

–తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు

ఘనంగా బషీర్‌బీబీ ఉరుసు ఉత్సవాలు

కొత్తపల్లి: పొన్నాడలో బషీర్‌బీబీ (బంగారు పాపమ్మ) దర్గా వద్ద 69వ ఉరుసు ఉత్సవాలు రెండో రోజు శనివారం ఘనంగా జరిగాయి. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దర్గా ప్రాంగణం చుట్టుపక్కల ప్రాంతాలు భక్తులతో కళకళలాడాయి. ఉత్సవాలను పురస్కరించుకుని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశాలను ఏర్పాటు చేశారు. స్థానిక ముజావర్లు షేక్ బషీర్, షేక్ ఇమామ్‌వలీ, షేక్ పీర్ మహమ్మద్, షేక్ నాధల్లి బాషా, షేక్ బడే సాహేబ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం నిర్వహించనున్న గంధోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ముజావర్లు తెలిపారు. కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అన్ని వాహనాలు దర్గా ప్రాంగణంలోకి వెళ్లనివ్వకుండా పొన్నాడ, నాగులపల్లి వద్దే నిలిపివేస్తున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో భక్తులకు కావాల్సిన తాగునీరు ఏర్పాటు చేసి, పారిశుధ్యంపై దృష్టిసారించారు.


విద్యుత్తు కాంతుల నడుమ బషీర్‌బీబీ దర్గా


దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముజావర్లు